

## ఇందులోని పాత్రలు

1. బి. జి. పాల్. 2. రాజు. 3. తాత. 4. కుందన్‌లాల్. 5. గణపతిరావు.

## ప్రదర్శనకు కావలసిన సామగ్రి

ఒక టేబిలు. రెండు కుర్చీలు. సోఫా. టీపాయ్. కోటు స్టాండు. పరుపుతో ఉన్న మంచం. దుప్పటి. తలగడ. రెండు గాజు గ్లాసులు. విస్కీ బాటిల్. గాంధిజీ చిత్రపటం. రెండు వేరు వేరు రంగుల జిప్‌బాగ్‌లు. సూట్‌కేస్. ఎయిర్ బాగ్. వందరూపాయల నోట్ల కట్టలు. విల్స్ కారియర్. రెండు పిస్టల్సు. కవరులో

కొమ్మశ్రీ

# స్నేహితుడు (నాటిక)

నున్న వైపుచేసిన కాగితం. నలిగి మడతలు పడిన కాగితం. చిన్న బల్ల. సిగరెట్ పాకెట్. సిగార్ లైటర్.

ప్రదర్శన కాల పరిమితి:

52 నిమిషముల నుంచి 56 నిమిషాల వరకు.

సాంకేతిక వివరణ:

ఆర్. ఎఫ్—ఎదుటి కుడివైపు ద్వారం

ఎల్. ఎఫ్—ఎదుటి ఎడమవైపు ద్వారం

ఎమ్. బి—వెనుక మధ్యనున్న ద్వారం.

ట్రావెలర్స్ బంగళాలో ఒక వాటా. గదిలో ఒక ప్రక్కగా టేబిలు, దానికి రెండు వైపులా రెండు కుర్చీలు ఉంటాయి. మరొక ప్రక్కగా సోఫా, దాని ముందు టీపాయ్ ఉంటాయి. వెనుక వైపు మూలను కోటు స్టాండు ఉంటుంది. ఎమ్. బి. కి ప్రక్కగా చిన్న బల్ల ఉంటుంది. ఎమ్. బి. కి పైన గాంధీజీ చిత్రపటం గోడకు వ్రేలాడుతూ స్పష్టంగా కనబడుతూ ఉంటుంది. ఎమ్. బి. లోనుంచి వెనుక నున్న మంచం కొద్దిగా కనబడుతూ ఉంటుంది. చీకట్లో తెర తొలగుతుంది. లైట్లు వెలుగుతాయి. మంచం మీద దుప్పటి సరిచేసి తలగడ సరిగా అమర్చుతూ ఎమ్. బి. నుంచి తాత కనబడుతుంటాడు—

రాజు : ( ఎల్. ఎఫ్. లో నుంచి ) తాతా! తాతా!

తాత : ( అటు చూస్తాడు. )

రాజు : ( ఎల్. ఎఫ్. లోనుంచి లోపలికి వస్తూ ) తాతా!

తాత : ( ఎమ్. బి. లోనుంచి వస్తూ ) ఎవరు? ( రాజును చూచి ఆగిపోతాడు. )

రాజు : ఈ బంగళా వాచ్‌మన్ నువ్వేనా, తాతా?

తాత : ( నిదానించి చూస్తూ ) బాబూ!

రాజు : ఏమిటి, తాతా, అంత పరిశీలనగా చూస్తున్నావు? ఈ ట్రావెలర్స్ బంగళా వాచ్‌మన్ నువ్వేనా?

తాత : అవును, బాబూ! నేనే! బాబూ! నీ పేరేమిటి, బాబూ?

రాజు : పేరుకు రాజు కానీ నిజానికి పేదరికానికి రాజును, తాతా!

తాత : ( నిట్టూర్చి ) రాజు! రాజు! కాదు. మా గోపీ కాదు.

రాజు : గోపీ ఎవరు?

తాత : మావాడే, బాబూ!

రాజు : నీ కేమవుతాడు?

తాత : అన్నీ కావలసినవాడు. ఏమీ కాకుండా పోయినవాడు. మా గోపీ నీ ఈడు వాడే! నీలాంటి పేదవాడే! అందుకే నిన్ను చూసి మా గోపీ ఏమో అనుకున్నాను.

రాజు : మీ వాడే అంటున్నావు! సరిగా ఎరుగవా మీ గోపీని?

తాత : ఒక్కసారే చూశాను! మళ్ళీ చూడాలనే బతుకుతున్నాను.

రాజు : ఏమయ్యాడు మీ గోపీ? ( ఎమ్. బి. దగ్గరకు వెళుతుంటాడు. )

తాత : ఎక్కడికో వెళ్ళాడు. మా గోపీ మంచివాడు. మనసున్నవాడు. ఎప్పటికైనా తిరిగి వస్తాడు. నన్ను క్షమించటానికైనా వస్తాడు.

రాజు : నిన్ను క్షమించటానికా? ఏం తప్పు చేశావు? ( ఎమ్. బి.లోకి చూస్తుంటాడు. )

తాత : హు! ఎందుకులే, బాబూ! అదంతా ఓ పెద్ద కథ. ( దగ్గరగా వెళుతూ )

ఆ! ఇంతకీ నీకేం కావాలి, బాబూ?

రాజు : (ఆర్. ఎఫ్. కేసి వెళుతూ ) నా స్నేహితుడు పెద్ద ఆఫీస రయ్యాడని విన్నాను. అత నీవేళ ఇక్కడకు వస్తాడని తెలిసింది. అతన్ని చూద్దామని వచ్చాను. ( లోపలకు చూస్తుంటాడు. )

తాత : అంత పెద్ద స్నేహితుడు ఉండి కూడా నువ్విలా ఉన్నావేం, బాబూ?

రాజు : ఎవరి అదృష్టం వాళ్ళది. ఇద్దరం కలిసే చదివాం. వాడు పెద్ద ఆఫీస రయ్యాడు. నేను శుద్ధ బికారి నయ్యాను. ( ఇటు వస్తాడు. )

తాత : అంత చదివినా నీకు ఉద్యోగం రాలేదా?

రాజు : ఈ రోజులలో చదువు ఒక్కటే చాలదు తాతా! చదువుకంటే ముఖ్య మైనవి చాలా ఉన్నాయి. ఆఫీసరుగారికి రిజర్వేషను వచ్చిందా?

తాత : వచ్చింది, బాబూ. ఎందుకు?

రాజు : వచ్చే ఆఫీసరు గారి పేరు అందులో ఉంటుందిగా! అతను నా స్నేహితు డవునో కాదో చూదామని. ఏదా కాగితం?

తాత : ( టేబిలు సొరుగులోనుంచి కవరు తీసి ఇస్తూ ) ఇదిగో బాబూ!

రాజు : ( కవరులోని కాగితం తీసి మడతలు విప్పి చదువుతాడు. ) రూమ్ నంబర్ వన్ ఈజ్ రిజర్వ్డ్ ఫర్ శ్రీ బి. జి. పాల్., ఎమ్. ఎ., ఎల్. ఎల్. బి., స్పెషలాఫీసర్, న్యూ ఢిల్లీ!

తాత : ఏమిటి, బాబూ, ఆయన పేరు?

రాజు : బి. జి. పాల్!

తాత : ఈయనేనా మీ స్నేహితుడు?

రాజు : కాదు, తాతా! మా వాడి పేరు బాలగోపాలం. అచ్చమైన ఆంధ్రుడు. స్వచ్ఛమైన హిందువు! పైగా మా వాడు చదివింది బి. ఎ. వరకే! ఎమ్.ఎ. ఎల్. ఎల్. బి. కాదు. ( కాగితం కవరులో పెట్టి టేబిలు మీదకు విసరి ) నా ఆశలన్నీ నిరాశలయ్యాయి, తాతా! ( సోఫాలో కూర్చోబోతాడు. )


తాత : ( వారిస్తూ ) ఆ! ఆ! వద్దు బాబూ!

రాజు : ( ఆగి వెక్కి తిరిగి ) ఏం తాతా? నేనేం పాపం చేశాను?

తాత : పేదరికమే మనం చేసిన పాపం బాబూ! పెద్ద పెద్ద వాళ్ళు వచ్చే బంగళా ఇది. ఎవరైనా చూస్తే నాకు మాట వస్తుంది బాబూ!

రాజు : పట్నానికి ఇంత దూరంలో ఉన్న ఈ బంగళా కెవరొస్తారు తాతా?

తాత : నీకు తెలియదు, బాబూ! ఇళ్ళల్లో జరగటానికి వీల్లేని పనులెన్నో ఇక్కడే




జరుగుతుంటాయి. వాటికోసమే పెద్దవాళ్ళు ఇక్కడకు వస్తుంటారు. అందుకే ఇటువంటి బంగళాలు ఊరికి దూరంగా ఉంటాయి. ఆఫీసరు గారే వచ్చినా రావచ్చు! నువ్వలా బయటకు వెళ్ళి కూర్చో బాబూ!

రాజు : సరేలే, తాతా! చెట్లింకా మనుష్యుల్లాగ మారలేదుగా! అవి అందరికీ సమానంగానే నీడ నిస్తాయి. ఆఫీసరు గారు వచ్చే వరకు తోటలో చెట్టు నీడను కూర్చుంటాను. ( ఎల్. ఎఫ్. లోకి వెళ్ళిపోతాడు. )

తాత : ( భుజం మీది తువాలుతో సోఫా దులుపుతాడు. వంకరగా ఉన్న గాంధి పటాన్ని సరిచేస్తుంటాడు. ఇంతలో కారు వచ్చి ఆగిన శబ్దం. అది విని ఎల్. ఎఫ్. కేసి వెళుతుంటాడు. )

పాల్ : ( సూటు బూటు హేటు నల్లద్దాల కళ్ళజోడుతో ఎల్. ఎఫ్. లోనుంచి వస్తాడు. )

తాత : ( నిదానించి చూస్తుంటాడు. )

పాల్ : ఎందుకలా చూస్తున్నావు?

తాత : ( కొయ్యబారి చూస్తుంటాడు. )

పాల్ : (కోపంతో గట్టిగా ) ఇడియట్! ఏమిటి చూస్తావు?

తాత : ( తుళ్ళిపడి కంగారుగా ) బాబూ! తమపే రేమిటి బాబూ?

పాల్ : బి. జి. పాల్. ఎమ్. ఏ. ఎల్. ఎల్. బి. స్పెషలాఫీసర్! న్యూఢిల్లీ.




రిజర్వేషను రాలేదా?

తాత : (భయంగా ) వచ్చింది, బాబూ!

పాల్ : నువ్వేనా బంగళా వాచ్‌మాన్?

తాత : అవును, బాబూ!

పాల్ : ఆల్‌రైట్! కారులో సామానుంది తీసుకురా!

తాత : అలాగే, బాబూ! ( అడుగులు తడబడుతూ ఎల్. ఎఫ్. లోకి వెళతాడు. )

పాల్ : (కోటు జేబులో నున్న పిస్టలు తీసి పట్టుకుని తొందరగా ఎస్. బి. లోకి ఆర్. ఎఫ్. లోకి వెళ్ళి చూసి తిరిగి వస్తూ పిస్టలు పాంటు జేబులో పెట్టుకుని కోటు తీసి స్టాండు మీద వేస్తాడు. )

తాత : ( సూట్‌కేసు, ఎయిర్ బేగ్ తెచ్చి బల్లమీద పెట్టి ) మంచినీళ్ళు తెమ్మంటారా?

పాల్ : అక్కరలేదు. ఖాళీ గ్లాసులు పట్టుకురా! ( ఎయిర్ బాగ్‌లోనుంచి విస్కీ బాటిలు తీసి పళ్ళతో సీసా మూత తీస్తాడు. )

తాత : ( ఈలోగా ఆర్. ఎఫ్. లోకి వెళ్ళి రెండు గాజు గ్లాసులు తెచ్చి టేబులుమీద పెడతాడు. )

పాల్ : కళ్ళజోడు తీసి టేబులు మీద ఎల్. ఎఫ్.కి ఎదురుగా పెట్టి గ్లాసులో విస్కీ పోస్తూ ( నీ పేరేమిటి) తాతా?

తాత : అలాగే పిలవండి, బాబూ! అందరూ అలాగే అంటారు! బాబూ! తమ రెవ్వరు, బాబూ?

పాల్ : నీ కొక పేరు లేనట్టుగానే నా కొక వూరంటూ లేదు. దేశమంతా నాదే. మాది ఆలిండియా స్పెషల్ సర్వీస్! ( గ్లాసెత్తి తాగబోయి గాంధిపటం చూసి ) తాతా! గాంధి చిత్రపటాన్ని ఇక్కడనుంచి తీసేయ్!

తాత : అది గవర్నమెంటోరు పెట్టించారు, బాబూ.

పాల్ : చిత్రపటాలకు హారతులు పడుతూ శిలావిగ్రహాలకు పూలు వేస్తూ ఆయన ఆశలకుఆశయాలకు సమాధులు కడుతున్నాం. ఆయనతోపాటే సత్యాన్ని, అహింసను చంపి తగులబెట్టాం! దొంగ పూజలు, కొంగజపాలు ఎందుకు తాతా? పట్టుకుపో పటాన్ని!

తాత : గాంధీజీ పటం ముందు తాగటానికి సిగ్గుపడుతున్నారా?

పాల్ : హా! సిగ్గా! సారా-ఉత్పత్తిని నమ్ముకుని లాటరీ టిక్కెట్లను అమ్ముకుని ప్రజలను మోసగించి సత్యం నాక్రమించి సొంత డబ్బా వాయించుకునే దొంగ సన్యాసుల దేశంలో ఎవరికి తాతా సిగ్గు? సిగ్గు తాగేవాళ్ళకుకాదు— చూసేవాళ్ళకు! ఆ మహాత్ముని సిగ్గు పరచటం ఇష్టంలేకనే పట్టుకు పొమ్మంటున్నాను.

తాత : సరే, బాబూ! తమలో మంచితనం దాగి ఉంది! అందుకే గాంధిపటం ముందు తాగటానికి వెనకాడుతున్నారు. గాంధి శిష్యులమనీ, గాంధేయ వాదుల మనీ చెప్పుకుంటూ ఎంత మంది పెద్దలు ఎన్ని సార్లు ఎన్ని రకాల తప్పుడు పనులు చేశారో ఈ పటం ముందు తమకు తెలియదు బాబూ! ( పటం తీసి ఎల్. ఎఫ్. లోకి పట్టుకుపోతాడు. )

పాల్: ( విస్కీ సిప్‌చేసి సిగరెట్ వెలిగిస్తుంటాడు. )

రాజు : ( ఎల్. ఎఫ్. లో నుంచి వచ్చి చేతులు జోడించి ) నమస్కారం సార్

పాల్ : ( అటు చూసి ఆనందాశ్చర్యంతో ) రాజూ!

రాజు : సార్! ( ముందుకు వస్తాడు. )

పాల్ : రాజూ! ( చేతులు చాపుతూ ) ఎన్నాళ్ళకు కనిపించావురా!

రాజు : (చేతులు పట్టుకుంటూ ) సార్!

పాల్ : ! అతని భుజాల మీద చేతులు వేసి ( సార్ ఏమిటిరా చారూ సాంబారూను నన్ను గుర్తు పట్టలేదా?

రాజు : పట్టాను. అందుకే వచ్చాను. మీరు కారు దిగి లోపలకు వస్తుంటే తోటలోనుంచి చూశాను. బాగా మారిపోయారే!

పాల్ : రాజా! మీరు, గారు అనకు. ఎంత మారిపోయినా నేను నీకు స్నేహితుడినే కదరా! ఎప్పటిలా, చిన్నప్పటిలా నన్ను బాలా అని పిలవరా! ఏరా అని పిలవరా!

రాజు : నేను బాగా గుర్తున్నానే!

పాల్ : నాలో ఏం చూసినా ఇంకా కృతజ్ఞత మాత్రం చావలేదురా! నేను కాలేజీలో చదవగలిగింది నీ మూలంగానే కదరా! నాకు బట్టలిచ్చావు పుస్తకా లిచ్చావు. ఫీజులు కట్టావు. నిన్నెలా మరిచిపోగలను రాజా

22-8-84

రాజు : ఆ రోజులు మారిపోయాయి, బాలా! పరిస్థితులు తారుమారయ్యాయి. నాన్నగారు చనిపోయారు. ఆస్తి అంతా అప్పుల వాళ్ళు పట్టుకుపోయారు. కలిమి పోయింది. లేమి మిగిలింది.

పాల్ : అమ్మ బాగుందా?

రాజు : చనిపోయి రెండేళ్ళయింది.

పాల్ : అమ్మ! అమ్మ చనిపోయిందా? ఆ తల్లి నీకే కాదు, నాకు కూడా అమ్మేరా. నన్నెంత ఆదరంతో చూసేది! మనం బి. ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యామని తెలిసిన నాడు నీతోపాటు నాకు కూడా తలంటి నీళ్ళుపోసి మన కిష్టమైన గారెలు, పాయసం చేసి పెట్టింది! ఆదరణకు కల్పవల్లి! ఆప్యాయతకు పాలవెల్లి! వెళ్ళిపోయిందా చల్లని తల్లి! ఎలా తీర్చుకోగలవా తల్లి ఋణం?

రాజు : బాలా! నాకు ఉద్యోగం దొరకలేదు. నువ్వేదో పెద్ద ఉద్యోగంలో ఉన్నట్టున్నావు. నా కేదైనా చిన్న పని — ఎంత చిన్నదైనా సరే— ఇప్పించు, బాలా! ఆస్తి పోవటంతో నా చదువు కూడా ఎందుకూ కొరగాకుండా పోయింది. చిల్లర కొట్టులో పద్దులు రాయటానికైనా పనికి రాలేదు నా చదువు.

పాల్ : అంతేరా మన చదువులు! చదువుకుంటున్నామనే ఆత్మ వంచనతో అమూల్యమైన కాలాన్ని పెద్దలు సంపాదించిన ధనాన్ని వృథాచేస్తున్నాం. పట్టా తీసుకుని బయటకు వస్తే ఎటు చూసినా అంధకారం. ఎటు పోయినా పైసాకు మారం!

రాజు : దేశమంతా ఇలాగే ఉందా, బాలా?

పాల్ : చదువుకున్న వాళ్ళకీ, హృదయమున్న వాళ్ళకీ కాదురా ఈ దేశం. మనసుకు మానవతకు తావు లేదురా ఇక్కడ. అక్షరాలు రాని అధికారుల పాలనలో న్యాయానికీ ధర్మానికీ విలువ లేని కాలంలో బలవంతులదే పయికుబడి. ధనవంతులదే రాబడి. మనలాంటి వాళ్ళకు మిగిలేది రాపిడి! ధనదాహంతో, పదవీ వ్యామోహంతో కుల మత వ్యత్యాసాల కుటిల సిద్ధాంతాలతో, రాజకీయాల మేజా వాణిలతో కుళ్ళిపోయిన మన సంఘంలో న్యాయంకోసం, ధర్మంకోసం పాకులాడటం పాముల పుట్టలో రత్నాంకోసం వెదకటంలాంటిది.

రాజు : రత్నాలను రాసులు పోసి అమ్మిన దేశం మనది.

పాల్ : అందుకేరా ఇప్పుడు ప్రజలు రాళ్ళు తిని బతుకుతున్నారు.

రాజు : అయితే నా లాంటి వాళ్ళు బతికే మార్గం లేదా?

పాల్ : ఉంది! ఈ సంఘానికి తగినట్టుగా తయారవ్వాలి! ( రెండవ గ్లాసులో విస్కీ పోస్తుంటాడు. )

రాజు : అంటే — ఏం చేయాలి?

పాల్ : ( గ్లాసు అందిస్తూ ) ఇది తీసుకో ముందు.

రాజు : బ్రాందీ తాగాలా?

పాల్ : గాంధి పుట్టిన దేశంలో సులువుగా దొరికేది బ్రాందీ ఒకటేరా!

రాజు : ఆ అలవాటు మా వంశంలో ఎప్పుడూ లేదు.

పాల్ : అమాయకుడా! అన్నీ అన్ని కాలాల్లోను ఉంటాయా? రాముని కాలంలో లైసెన్స్‌డ్ బ్రోతల్ హౌసెస్ ఉన్నాయా? ధర్మరాజుకాలంలో ప్రభుత్వ సారా దుకాణాలున్నాయా? మన తాత ముత్తాతల కాలంలో నిత్యావసర వస్తువుల ధర లిలా మండిపోయాయా? కవులు, కళాకారులు పనికిమాలిన పందికొక్కులుగా జమకావటం ఇంతకు ముందుందా? కాలాన్నిబట్టి మారాలిరా!

రాజు : క్షమించు, బాలా! పెళ్ళాం పిల్లలు ఆకలితో మల మల మాడిపోతుంటే, నేను తాగి తందనాలాడలేను. మా కుటుంబాన్ని ఆకలి మంటల నుంచి తప్పించు, బాలా!

పాల్ : ( గ్లాసు టేబిలుమీద పెట్టి కోటు జేబులోనుంచి డబ్బు తీసి ఇస్తూ ) వూ! ఇంద! తీసుకువెళ్ళి ఇంట్లో ఇవ్వరా!

రాజు : ( దూరంగా వెళుతూ ) డబ్బా? వద్దు, బాలా!

పాల్ : ఏం? ఎవరైనా అనుమానిస్తారనా? అవునులే! పేదవానికి పెన్నిధి దొరికితే దొంగసొమ్మంటుం దీ లోకం! కలవాడు దొంగతనం చేసినా కలిసి వచ్చిందంటుం దీ లోకం!

రాజు : అది కాదు, బాలా! పట్టినే తీసుకోవటం నా కిష్టం లేదు.

పాల్ : కూలికోసం హత్యలు చేస్తున్న మనుషుల మధ్య బతుకుతూ ధర్మపన్నాలు వల్లిస్తావేంరా? పట్టినే కాదులే. నువ్వు చేయబోయే పనికి నే నిచ్చే జీతంలో అడ్వాన్సుగా తీసుకో!

రాజు : ఏమిటా పని?

పాల్ : నాకు పర్సనల్ సెక్రటరీగా ఉందువుగాని. నెలకు రెండువేలు జీతం. ఇది అడ్వాన్సు! నిన్ను చూస్తుంటే నీ సంసారం సంగతి అర్థమవుతోంది. పిల్లలకు మంచి బట్టలు వేసి శుభ్రంగా ఉంచమని చెప్పు మీ శ్రీమతికి. బై ది బై! ఎంతమంది పిల్లలు మీకు?

రాజు : ముగ్గురు.

పాల్ : ముచ్చటగా ముగ్గురితో సరిపెట్టా వన్నమాట. మంచిదే! సాయంకాలం మీ ఇంటికి వచ్చి మీ పిల్లలను చూస్తాను.

రాజు : నిజంగా మా ఇంటికి వస్తావా, బాలా?

పాల్ : నా దృష్టిలో స్నేహితుని మించిన దేవుడు లేడురా! మీ ఇంటికి రావటం దేవాలయానికి వెళ్ళటమే! తప్పకుండా వస్తాను! మీ శ్రీమతితో చెప్పు తన కో కొత్త అన్నయ్య వస్తాడని!


రాజు : (బాధగా) బాలా ... నిన్ను ... నిన్ను ...

పాల్ : ఏరా? ఎందుకలా తొట్రుపడుతున్నావు?

రాజు : ( రుద్ధకంఠంతో ) నిన్నెలా ... ఎలా అభినందించాలో తెలియటంలేదు.

పాల్ : (నవ్వి) ఇంటికి వెళ్ళి మీ శ్రీమతిని అడిగిరా! ( నోట్లు జేబులో పెడతాడు. )

రాజు : ( నోట్లు తీసి చూస్తూ ) తొందరగానే వస్తాను. దగ్గరలోనే మా ఇల్లు! ( నోట్లు లెక్క పెడుతూ ఎల్. ఎఫ్. లోకి వెళ్ళిపోతాడు. )




పాల్ : ( విస్కీ సిప్‌చేసి సిగరెట్ వెలిగిస్తాడు. )

తాత : ( కారియర్ పట్టుకుని ఎల్. ఎఫ్. లోనుంచి వచ్చి ) బాబూ!

పాల్ : ఏం తాతా?

తాత : ఆ కుర్రాడు నోట్లు లెక్కపెట్టుకుంటూ వెళుతున్నాడు. తమరిచ్చారా... లేక ...

పాల్ : (నవ్వి) అవును, తాతా! వాడు దొంగతనం చేయలేడు. చేయటం చేతకాదు వాడికి. అందుకే అలా ఉన్నాడు. అతను నా స్నేహితుడు. (గ్లాసు ఖాళీ చేసి మళ్ళీ పోస్తుంటాడు. )

తాత : బాబూ! పెద్దోడిని. తమరు మన్నిస్తానంటే ఒక్క మాట ...

పాల్ : తాగుడు మంచిది కా దంటావు! అంతేనా? మంచిదని ఏ తాగుబోతూ చెప్పడు. మారటం మంచిది కాదని తెలిసి కూడా పార్టీలు మారుతున్నాం. చేయటం మంచిది కాదని తెలిసి కూడా నెరవేర్చలేని వాగ్దానాలు చేస్తున్నాం. తినటం మంచిది కాదని తెలిసి కూడా ప్రజాధనం తింటున్నాం. తాగుడు కూడా అటువంటిదే, తాతా!

తాత : అటువంటివి ఇతరులకు హాని చేస్తాయి. ఈ తాగుడు మన జీవితాలనే నాశనం చేస్తుంది, బాబూ. ఎటువంటి వాళ్ళకైనా మెదడును మత్తెక్కించి హృదయాన్ని చంపుతుంది, బాబూ!

పాల్ : అదే కావాలి! ( గ్లాసెత్తి ) అందుకే తాగాలి! ( సిప్‌చేసి ) ఈ సంఘంలో బతకాలంటే హృదయ ముండకూడదు, తాతా! దేశంలో పరవళ్ళు తొక్కుతున్న ధనదాహం ముందు, అధికార దాహం ముందు ఈ తాగుడు దాహ మెంత, తాతా? ( తాగుతాడు)

తాత : మీ ఇష్టం, బాబూ! తమకు భోజనం తెమ్మంటారా?

పాల్ : ఆ! తీసుకురా! చూడు, తాతా! మా వాడికి ఉల్లి గారెలంటే చాలా ఇష్టం. వాడితో కలిసి భోజనం చేయాలి ఈ వేళ! ఉల్లి గారెలు, సగ్గుబియ్యం పాయసం తీసుకురా! ( కోటుజేబులోనుంచి వంద రూపాయల నోటు తీస్తుంటాడు. వీధిలో కారాగిన శబ్దం వినబడుతుంది. తొందరగా వచ్చి నోటిస్తూ ) కా రాగింది. ఎవరో వచ్చారు. ముఖ్యాళ్ళు.

తాత : సరే, బాబూ! ( కారియర్ పట్టుకుని ఎల్. ఎఫ్. లోకి వెళ్ళిపోతాడు. )

పాల్ : ( ఆర్. ఎఫ్. కేసి ముఖం పెట్టి కుర్చీలో కూర్చుని టేబిల్ మీద ఉన్న వల్లద్దాల కళ్ళజోడు లోకి చూస్తూ విస్కీ సిప్ చేస్తుంటాడు. )

కుందన్‌లాల్ : ( జిప్‌బాగ్ పట్టుకుని మెల్లగా వచ్చి ఎల్. ఎఫ్. లో ఆగుతాడు.)

పాల్ : ( కళ్ళజోడు పెట్టుకుని అటు చూడకుండానే ) ఆయియే శేట్ జీ!

కుందన్‌లాల్ : ( చటుక్కున వంగి సలాముచేస్తూ ) నమష్కార్! నమష్కార్! ( ముందుకు వస్తూ ) మేము వచ్చిందీ అని ఎట్లా తెలిసిందీ, మహరాజ్ ?

పాల్ : (లేచి ఎదురుగా నిలిచి) తెలుసు, శేట్‌జీ! నా కన్నీ తెలుసు! ఈ రోజున మీ దగ్గర దొంగ బంగార మెంత ఉందో, మీ బ్లాక్ మనీ ఎక్కడ దాచారో చెప్పమంటారా? ( సోఫాలో కూర్చుంటాడు ).

కుందన్‌లాల్ : ( చేతులు జోడించి ) వకో మహరాజ్! వకో!

పాల్ : అచ్చీ బాత్! బైఠియే!

కుందన్‌లాల్ : షుక్రియా, మహరాజ్! ( కుర్చీలో కూర్చుంటాడు. )

పాల్ : శేట్‌జీ! చాయ్ తాగుతారా?

కుందన్‌లాల్ : నై! నై! షుక్రియా!

పాల్ : పోనీ ... విస్కీ?

కుందన్‌లాల్ : ఆదాబర్సే! అలవాటు లేదు, సాబ్!

పాల్ : అయిదేళ్ళ క్రితం చాటుగా నాటుసారా తాగేవారు కదా! ( లేచి టేబిలు దగ్గరకు వస్తూ ) ఇంకా అదే తాగుతున్నారా? తాగుడు స్వాతంత్ర్యం వచ్చినా మీ అలవాటు మారలేదన్నమాట! ( విస్కీ సిప్ చేస్తాడు. )

కుందన్‌లాల్ : (భయంగా నవ్వుతూ లేచి) మీదీ దగ్గరా మంత్రం ఉంది, సాబ్.

పాల్ : మంత్రం కాదు, శేట్‌జీ! తంత్రం! స్వతంత్ర దేశంలో ప్రతివాడికి దక్కింది తంత్రం ఒక్కటే! వూ! నా నోటీసు అందిందా?

కుందన్‌లాల్ : అందినాదీ, సాబ్! అందుకే వచ్చినాం.

పాల్ : మంచిది! అయిదేళ్ళ క్రితం మీ దగ్గర బ్లాక్ మనీ పదిలక్షలుండాలి ఈపాటి కది యాభయి లక్షలై ఉంటుంది!

కుందన్‌లాల్ : ( కంగారుగా ) నై సాబ్! నై! మీకే ఏమి చెప్పవాలా, సాబ్?

పాల్ : చెప్ప నక్కరలేదు. నాకు తెలుసు! మీ కిప్పుడు పది లక్షలు ఇన్‌కంటాక్సు వేయాలి!

కుందన్‌లాల్ : ( గుండె నిమురుకుంటూ ) బాప్‌రే! భగవాన్! పదీ లచ్చల్?

పాల్ : అది కూడా తక్కువే! పాతిక లక్షలైనా వేయొచ్చు.

కుందన్‌లాల్ : (భయంగా చేతులు జోడించి ) మహరాజ్! మహరాజ్!

పాల్ : అయిదేళ్ళ క్రితమే ఆరితేరిన అంతర్రాష్ట్ర దొంగ వ్యాపారి మీరు. ఈ పాటికి అంతర్జాతీయ స్థాయికి పెరిగి ఉంటారు! అటు కరువు, ఇటు మీరు పోటీ పడి మరీ పెరిగిపోతున్నారుగా!

కుందన్‌లాల్ : నై! నై!

పాల్ : (కోపంగా ) శేట్‌జీ! నన్ను దబాయించాలని చూస్తే మీ ఆస్తంతా ప్రభుత్వ పర మవుతుంది. మీకు ఉరిశిక్ష పడుతుంది. నేను ఆలిండియా స్పెషలాఫీసర్ని! మర్యాదగా ఒప్పుకోండి నిజాన్ని!

కుందన్‌లాల్ : క్యాబోల్నా మహరాజ్ ?

పాల్ : మీ బ్లాక్ మనీ అంతా బయట పెట్టాలి.


వెలువడినవి...

జులై '84 విడుదలలు

| | |
|---|---|
| వెన్నెల మెట్లు - మైనంపాటి భాస్కర్ | 20-00 |
| రాక్షసీ - నీపేరు రాజకీయమా... ఆదివిష్ణు | 16-00 |
| మోహనరూప - మాదిరెడ్డి సులోచన | 15-00 |
| సంధ్య - మాదిరెడ్డి సులోచన | 15-00 |

మే '84 విడుదలలు


| | |
|---|---|
| యక్షగానం - మాదిరెడ్డి సులోచన | 17.00 |
| హ్యూమరాలజీ - యర్రంశెట్టి శాయి | 18.00 |
| సంధ్యాకల్యాణం - పోల్కంపల్లి శాంతాదేవి | 15.00 |
| హంసధ్వని - కొమ్మనాపల్లి గణపతిరావు | 20.00 |
| బుద్ధిజీవి - మైనంపాటి భాస్కర్ | 12.50 |
| దేవుడూ నీ కులమేమిటి? - యండమూరి వీరేంద్రనాథ్, వీరభద్రరావ్ పమ్మి, డి. ప్రభాకర్ | 15.00 |

పుస్తకం ధరలో 10రూ.లు M.O. చేయండి.
మిగిలిన డబ్బుకి V.P.లో పంపగలం!

నవసాహితి బుక్ హౌస్,
ఏలూరు రోడ్, విజయవాడ-520 002




సంకోచం లేకుండా సంప్రదించండి!
సరైన సంబంధాన్ని కుదుర్చుకోండి!!





ఫోన్: 940

కాకతీయ
ఇన్‌ఫర్‌మేషన్ సర్వీస్
రాజేంద్రనగర్, 1వ లైన్, గుడివాడ-521 301

కుందన్‌లాల్ : కుచ్‌నై! బ్లాక్ మనీ కుచ్ నై, సాబ్!
పాల్ : (కోపంగా ) కుందన్‌లాల్ శేట్‌జీ! బ్లాక్ మనీ మీ ఇంటి నేం గదిలో ఎన్ని బీరువాలలో ఉందో! బ్లాక్‌ని వైట్ చేయటానికి ప్రయిజు వచ్చిన లాటరీ టిక్కెట్లు ఎవరి దగ్గర కొన్నారో, మీ దొంగ లెక్కల పుస్తకా లెక్కడ దాచారో వివరంగా చెప్పమంటారా?
కుందన్‌లాల్ : (భయంతో కంగారుగా) నకో, సాబ్! నకో! గోడల్‌కీ చెవులూ ఉంటాయి!
పాల్ : నాకు దివ్యనేత్ర ముంది. మరచిపోకండి! మీ రహస్యాలు కొన్ని మీకు రాసిన ఉత్తరంలో వివరించాను. ఇంకా చెప్పమంటారా మీ రాతి గోడం మేడలో దాగిపోయిన రహస్యాలు?
కుందన్‌లాల్ : ( తొందరగా ఎల్. ఎఫ్. కేసి వెళుతుంటాడు. ).
పాల్ : ( చటుక్కున పిస్టలుతీసి పట్టుకుని ) ఆగండి.
కుందన్‌లాల్ : (వెనక్కి తిరక్కుండానే) ఏక్ మినిట్, సాబ్! ( తలుపులు మూస్తుంటాడు. )
పాల్ : (పిస్టలును టేబిల్ సొరుగులో పెడతాడు. )
కుందన్‌లాల్ : ( వంగి వంగి వచ్చి కాళ్ళు పట్టుకుని ) మాఫ్ కీ జియే మహరాజ్.
పాల్ : (దూరంగా తప్పుకుని) లేవండి! ఛీ! లేవండి.
కుందన్‌లాల్ : ( లేచి దోసిలి పట్టి ) తమరు రాసినట్టుగా పాతికవేలు తెచ్చినాం. పచ్చీస్ హజార్! (బాగ్‌లోని నోట్లకట్టలు తీసి టేబిలు మీద పెట్టి నమస్కారం చేస్తూ ) ఇంక మాకీ ఇడిచి వేయాల, మహరాజ్.
పాల్ : ఛీ! ఈ మాట మూడోవాడికి తెలిస్తే ...
కుందన్‌లాల్ : లేదు, మహరాజ్! మీకీ సేమంగా ఉండాలా! మాకీ ఫాయిదా కలగాల! తమరు మాదీ దోస్త్! ఆప్ దోస్త్ హైనా!
పాల్ : ( నోట్లకట్టలు సొరుగులో వేస్తూ ) ఇవి మంచి నోట్లేనా, లేక మీ ఇంట్లో అచ్చువేశారా?
కుందన్‌లాల్ : నై! నై! అదిమాత్తరం లేదు, సాబ్.
పాల్ : మంచిది! ఇన్‌కమ్ టాక్స్ ఎగవేసి ప్రభుత్వాన్ని మోసగించకండి.
కుందన్‌లాల్ : జీ, మహరాజ్!
పాల్ : నమ్మిన పేదవాళ్ళను నాశనం చేయకండి.
కుందన్‌లాల్ : నై సాబ్! అట్లా చేసేది లేదు.
పాల్ : మళ్ళీ దబాయిస్తున్నారు. ఒక పేద రిక్షావాడికి మీ రెంత అన్యాయం చేశారో మరిచిపోయారా? అయిదేళ్ళ క్రితం ఒక రిక్షా వాడు ప్రతి రోజు మీ పిల్లల్ని తన రిక్షాలో బడికి తీసుకు వెళ్ళేవాడు! గుర్తుందా?
కుందన్‌లాల్ : హా! హా! హవ్, సాబ్!
పాల్ : ఆ రిక్షావాడు తన రిక్షా మీదున్న అప్పు తీర్చుకుందామని మీ రివ్వ వలసిన కిరాయి తాలూకు మొత్తం తొంభయి రూపాయలు మీ దగ్గరే దాచుకున్నాడు. ఒకనా డా రిక్షావాని తండ్రి లారీ క్రింద పడి తల పగిలి చావ సిద్ధంగా ఉంటే రిక్షావా డెంత ఏడ్చినా మీ రా డబ్బివ్వలేదు. అవునా?
కుందన్‌లాల్ : ఆ రోజు మంగల్‌వార్, మహరాజ్!
పాల్ : మంచి రోజు వచ్చే వరకు మృత్యు వాగుతుందా? మనిషిమీద సాటి మనిషికే సానుభూతి లేకపోతే మృత్యువు కెలా ఉంటుంది? ఎందు కుండాలి? ఈ రోజు కూడా మంగళవారమే! వాడి డబ్బు వాడి కివ్వటానికి పనికిరాని మంగళవారం మీ డబ్బు నా కివ్వటానికి ఎలా పనికి వచ్చింది, శేట్ జీ? వాడు కాళ్ళు పట్టుకుని కనికరించమంటే తన్ని పొమ్మన్నారు. నేను జుట్టు పట్టుకుని గుంజితే చచ్చినట్టు ఇస్తున్నారు! మంచిని వంచించి. మానవత్వాన్ని హింసించి మనిషిని రాక్షసునిగా మార్చేది మీరేకదూ!
కుందన్‌లాల్ : తప్పూ చేసినాం! మాఫ్ కరో, మహరాజ్!
పాల్ : ఛీ! క్షమిస్తాను! ఎందుకో తెలుసా?
కుందన్‌లాల్ : ఫర్మాయియే!
పాల్ : మీ భార్య ఉత్తమురాలు. మీకు తెలియకుండా ఆ రిక్షా వాడికి అప్పు డప్పుడు అన్నం పెట్టేది. ఆ చల్లని తల్లిని తలుచుకుని మిమ్మల్ని క్షమిస్తున్నాను.
కుందన్‌లాల్ : జీ! మీకీ ఎట్లా తెలిసిందీ, మహరాజ్!
పాల్ : ఇంకా తెలుసు, శేట్ జీ! మీ పార్ట్‌నర్స్‌ని మోసగించి మీరు మార్చి రాసిన




లెక్కల వివరాలు — మీ పెద్దబ్బాయి చేస్తున్న దుర్మార్గ దురంతాలు చాలా చెప్పా డా రిక్షావాడు.
కుందన్‌లాల్ : అయిసా! రిక్షావాలా ఎక్కడా ఉన్నాడు, సాబ్?
పాల్ : మా డిపార్టుమెంటులోనే. నా దగ్గరే పనిచేస్తున్నాడు.
కుందన్‌లాల్ : అచ్ఛీ బాత్! వాడికీ రాం రాం! మాకీ సెలవూ ఇవ్వాల.
పాల్ : నేను చెప్పింది గుర్తుందా? నన్ను మోసగించాలని ప్రయత్నిస్తే మీరే వలలో చిక్కుకుంటారు! మీ రికార్డంతా మా అసిస్టెంటు దగ్గర భద్రంగా ఉంది.
కుందన్‌లాల్ : ( చేతులు జోడించి ) నై సాబ్! ఆప్ హమారా దోస్త్!
పాల్ : మంచిది. వెళ్ళిరండి!
కుందన్‌లాల్ : రాం! రాం! ( బాగ్ పట్టుకుని ఎల్. ఎఫ్. లోకి వెళ్ళిపోతాడు.)
పాల్ : ( కళ్ళజోడు తీసి టేబిల్‌మీద పెట్టి సిగరెట్ వెలిగించి గ్లాసులో విస్కీ పోస్తుంటాడు. )
రాజు : ( ఎల్. ఎఫ్. లోంచి వచ్చి ) బాలా! ఈ డబ్బు వద్దంది మా ఆవిడ! ( నోట్లను టేబిలుమీద పెడతాడు.)
పాల్ : ఎందుకని? అవి దొంగనోట్లా? నా కిచ్చినవాడు అచ్చువేశాడేమో తెలియదు. నేనుమాత్రం వేయలేదు.
రాజు : అది కాదు, బాలా! పని చేసిన తర్వాతనే జీతం తీసుకోవాలంది.
పాల్ : నీకు తగిన ఇల్లాలే దొరికిందిరా! అందుకే ఈ దరిద్రం.
రాజు : బాలా! నీకు పెళ్ళయిందా?
పాల్ : ఇంకా లేదురా!
రాజు : ఇంత పెద్ద హోదాలో ఉన్నావు! ఏం లోటని పెళ్ళాడలేదు? నువ్వు వూ అంటే లక్షాధికారుల కూతుళ్ళు క్యూలో నిలుచోరూ?
పాల్ : రాధ! నా రాధ! నాకోసం — తన మాటకోసం—అలాగే నిలబడిందిరా నా రాధ!
రాజు : ఎవ రా రాధ?
పాల్ : రాధ నా హృదయం! నా జీవితం! నా సర్వస్వం! ఎంత అందంగా నవ్వు తుంది నా రాధ! నవ్వితే ఎంత అందంగా ఉంటుంది నా రాధ! నీలాల నింగిలో తళతళ మెరిసే తారకా జ్యోతుల్లాంటి కళ్ళలో ఎంత కళా విలాసం! అర విరిసిన గులాబి రేకుల్లా మరులు చిందే అధరాలమీద ఎంత చిక్కని మందహాసం! రాధకోసమే నా తపన! రాధకోసమే నా బ్రతుకు!
రాజు : మరి పెళ్ళెందుకు చేసుకోలేదు?
పాల్ : అప్పట్లో నేను దారిలేని నిరుపేదను. రాధ తండ్రి లక్షల కధికారి. అంతస్తుల అంతరాలే మా పెళ్ళికి అంతరాయ మయ్యాయి.
రాజు: అంత ధనవంతుల బిడ్డ నీ కెలా పరిచయమయింది?




పాల్: చెబుతాను. ( విస్కీ సిప్ చేసి ) అయిదేళ్ళ క్రితం మనం విడిపోయాం కదూ!

రాజు: అవును! డిగ్రీ తీసుకోగానే విడిపోయాం.

పాల్: పట్టా చేతిలో పెట్టి మనల్ని బయటకు తరిమిన యూనివర్సిటీ మన భవిష్యత్తు గురించి ఎప్పుడైనా ఆలోచించిందా?

రాజు: దానికేం పట్టింది? ఆ బాధ్యత మనది కదా!

పాల్: కాదు, రాజూ! చదువుకున్న వాడికి తన భవిష్యత్తు ఏమిటి అనే ఆలోచనే ఉండకూడదు. కళాశాలలు నిరుద్యోగులను తయారు చేసే కర్మాగారాలు కాకూడదు. విద్యావిధానం జీవితంతో ముడిపడి పోవాలి. విద్యకు విలువుండాలి. పట్టాకు పరువుండాలి.

రాజు: ఎప్పుడూ ఉంటుంది. మన అదృష్టం కలిసి రావాలి.

పాల్: లేదు, రాజూ! ఈ చదువులు నిరుపయోగం. పరపతి. సిఫార్సులు లేని నాకు ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. చివరకు ధనరాజు గారింట్లో చిన్నపిల్లలకు ట్యూషను చెప్పటానికి కుదిరాను.

రాజు: ఎవ రా ధనరాజు?

పాల్: మా వూరి వాడే! పెద్దలు సంపాదించిన లక్షలు చేసే ఆస్తిని మంచినీళ్ళలా ఖర్చు చేసేవాడు. గుర్రప్పందాలాడుతూ ఎప్పుడూ నిషాలో హైదరాబాద్‌లో ఉండేవాడు. వాళ్ళ పెద్దమ్మాయి రాధ నాతో చనువుగా ఉండేది మా స్నేహం ప్రేమగా మారింది. అది బయటపడగానే నన్ను చావ గొట్టి వీధిలో పడేశారు!

రాజు: ప్రేమించటం నేరమా?

పాల్: అనే అడిగింది రాధ! అవునంది సంఘం. ప్రేమ వ్యవహారం ప్రేమగానే ఉండాలి కాని పెళ్ళి వరకు వెళ్ళకూడదన్నారు పెద్దలు. నా రాధ అభిమానవతి. నీతి, నిజాయితీ ఉన్న నిప్పు లాంటి మనిషి. ప్రేమించిన వాడినే పెళ్ళాడతానంది. అదే మా ఎడబాటుకు కారణమయింది.

రాజు: ఇప్పు డెక్కడుంది రాధ?

పాల్: మా వూళ్ళోనే! ఎన్ని యుగాలైనా నా కోసం ఎదురు చూస్తుంది. పది లక్షలు సంపాదిస్తే తప్ప తనకు అల్లుడు కాగల అర్హత లేదన్నాడు ధనరాజు. పది లక్షలు పూర్తి చేసి రాధను పెళ్ళాడటానికే ఇప్పుడు వచ్చాను.

రాజు: మరి! ఇక్కడే ఆగిపోయావేం?

పాల్: వెళతాను. మరో అరగంటలో ఇక్కడ నా పని పూర్తవుతుంది. పూర్తి కాగానే వెళతాను. నా రాధను పెళ్ళాడతాను. రాధ మనసు తోపాటు ఆమె అందాలన్నీ నా సొంతం చేసుకుంటాను. ఆమె నవ్వుల నందనవనంలో పారిజాత మకరంద పాన మత్త సారంగంలా పరవశిస్తాను. రాజా! మా పెళ్ళికి నా తరఫున పెద్దవు నువ్వేరా! నీ చేతుల మీదుగా మా పెళ్ళి జరిపించాలిరా!

( చేతులు పట్టుకుంటాడు )

రాజు: బాలా! నీ లాంటి స్నేహితు డున్నందుకు గర్వ పడుతున్నాను.
( బాధగా రుద్ధ కంఠంతో ) ఆనందిస్తున్నాను. కానీ. కానీ.

పాల్: కానీ ఏమిటిరా? చెప్పు! ఎందు కలా కంట తడి పెట్టుకుంటున్నావు?

రాజు: నీకు నేనెటువంటి సాయం చేయలేను బాలా!

పాల్: నిండుమనసుతో ఆశీర్వదించరా! అదే చాలు నాకు!

రాజు: బాలా! ( దుఃఖంతో ) బాలా! ( చేయి గట్టిగా పట్టుకుంటాడు )

పాల్: ఏమిటిరా ఇది? ఎందుకా కన్నీరు?

రాజు: నేను నిస్సహాయుడిని బాలా! అవధులు లేని నీ ఆత్మీయతకు, కల్మషం లేని నీ స్నేహానికి నేను ఋణ పడి పోతున్నాను బాలా!

పాల్: పేదవాడినని బాధ పడకు రాజా! నీ మనసు నాకు తెలుసు! నాకు కావలసింది నీ మనసు కానీ డబ్బు కాదు. ( అతని కన్నీరు తుడిచి ) నా దగ్గర కావలసినంత డబ్బుంది. నీ ఇష్టం వచ్చినంత ఖర్చు పెట్టు. అదిగో ఆ సూటుకేసు నిండా డబ్బే! ఆ ఎయిర్ బాగ్‌నిండా డబ్బే! టేబిలు సొరుగు నిండా డబ్బే! నీ ఇష్టం! తీసుకో!

రాజు: ( కన్నీ రొత్తుకని ) ఇంత డబ్బెలా సంపాదించావు? ఈ ఉద్యోగంలోనే?

పాల్: అవును రాజా! రాధను పెళ్ళాడటం కోసం!

రాజు: అదృష్టవంతుడవు. ట్యూషను పోగానే ఈ ఉద్యోగం వచ్చిందా?

పాల్: లేదురా! ట్యూషన్ పోగానే పల్లె నుంచి ఈ పట్నం వచ్చి రిక్షా తొక్కటం ప్రారంభించాను.

జు: చివరకు రిక్షా తొక్కావా?

పాల్: అది మాత్రం అంత సులువుగా దొరికిందా? బిచ్చగాడికి బిచ్చగాడే శత్రువని కొత్త వాళ్ళను రానివ్వనంది రిక్షా డ్రైవర్ల సంఘం. లంచమిస్తే కాని లైసెన్సు ఇవ్వనంది పురపాలక సంఘం. ఎక్కి దిగిపోవటం తప్ప కిరాయి ఇవ్వనంది ఎర్ర టోపీల సంఘం. ( సిగరెట్ వెలిగిస్తుంటాడు. వీధిలో కారాగిన శబ్దం వినబడుతుంది. విస్. ఎఫ్. కేసి చూస్తుంటాడు )!

రాజు: కారాగింది. నీ కోసం ఎవరో వచ్చినట్టున్నారు. మీ లాంటి పెద్దవాళ్ళ మధ్య నా లాంటి బికారి గాళ్ళుండకూడదు. మళ్ళీ వస్తాను, బాలా!
ఎల్ ఎఫ్. కేసి వెళుతుంటాడు. )

పాల్: అక్కరలేదు, రాజా! నీ ముందు నాకు రహస్యాలు లేవు.

రాజు: నీకు లేకపోవచ్చు. వచ్చే వాళ్ళకు ఉండవచ్చుగా. ( వెళ్ళిపోతాడు. )

పాల్: ( సిగరెట్ పీల్చుతూ కుర్చీలో కూర్చుని కళ్ళజోడు పెంత చూస్తుంటాడు. )

గణపతిరావు: ( జిప్‌బాగ్ చంకను పెట్టుకుని ఎల్. ఎఫ్ లోకి వచ్చి ఆగుతాడు.)

పాల్: ( కళ్ళజోడు పెట్టుకుని ఆర్. ఎఫ్. కేసి చూస్తూనే ) రండి, గణపతి రావుగారూ.

గణపతిరావు: అయ్! ఉండాలండి! సూసినట్టుగానే సెప్పేసినారు. తమరికి ఒల్లంతా కళ్ళుండాయండి! గదంతే గదండీ! తమరి ఉద్దోగం అసుమంటిది! ( ఎదురుగా వచ్చి ) అయ్! మరండీ, మెంత్రిగార్ని సాగనంపి ఎల్లిపో యెచ్చేసునానండి! అందుకండి అంస్సెమైనానండి. తమరు పెద్దోరు. సెమించాలండి మరి!

పాల్: ఫరవాలేదు. కూర్చోండి.

గణపతిరావు: ( సోఫాలో కూర్చుంటూ ) టాంక్సు! టాంక్సు సారూ!! అయ్! మరండీ! తమరు సెమింతానంటే ఒక మాట.

పాల్: ఏమిటి చెప్పండి?

గణపతిరావు: మరింటే! తమరిగ నెక్కడో సూసినట్టుగుందండి!

పాల్: ( నవ్వి ) వూ! ఎక్కడ చూశారు?

గణపతిరావు: అయ్ బాబో! ఎక్కడ సూసినా? సీవు మినిట్టేరు దగ్గరా? సిన్న మినిట్టేరు దగ్గరా? మొత్తంమీద సూసినా!

పాల్: అదేం కాదు. పేపర్లో చూసి ఉంటారు. ఈ మధ్య నా ఫోటో చాలాసార్లు పడింది లెండి పేపర్లో!

గణపతిరావు: ఆ! ఆ! అద్దిగదీ ఇసయం. అయ్! ఎరుకైనాది! ఇంగిలీసు పేపరులో కదండీ! తమరిలాంటి గొప్పోరి పోటోలు ఇంగిలీసు పేపర్లో గాక తెలుగు పేపరులో పడుద్దేంటి? సత్తెవే! నానూ సదివినా! గానీ ఇసయం గేపకం నేదండి! మరండీ ఈ మాయదారి రాజకీయాలు ఎరుక లేకుండా సేత్తున్నాయండి! అయ్! మరండీ! పేపర్లో కత కమామీసు రాసినందుకు

పడిందేంటి మీ పోటో?.

పాల్: కాదు. హత్యానేరాలను పరిశోధించి పట్టుకున్నాను.

గణపతిరావు: ఆయ్ బాబో! అవును గదండీ! ఆనాగే సదివినా! గనయిజయం సాధించేసినారు! తవరిలాంటోరు తలుసుకుంటే దొంగనా కొడుకులు దొరక్కపోతరేంటి?

పాల్: దశాబ్దాలుగా దాచబడిన హత్యానేరాలను బయటకు లాగాను. భూమిలో పాతి పెట్టిన రహస్యాలను పైకి తీశాను. అంతర్జాతీయ హంతకులను పట్టేశాను.

గణపతిరావు: ఆయ్! అంతేకదండి మరీ. తవరి నాంటోరు రంగంనోకి దిగితే తప్ప ఈ నేరాలు తగ్గవు, సారూ!

పాల్: అందుకే కదా స్వయంగా వచ్చాను.

గణపతిరావు: ఆయ్! ఇక్కడేమైనా మరడరు కేసులు జరిగినా యంటరా?

పాల్: మీకు రాసిన ఉత్తరంలో అన్నీ వివరించానే!

గణపతిరావు: ( ఇబ్బందిగా నవ్వి ) ఆయ్ బాబో! పాత కేసుల ఇసయం కాదండీ!

పాల్: కొత్తగా మీ రేమీ చేయించలేదా?

గణపతిరావు: ఆయ్! ఏటండీ?

పాల్: హత్యలు!

గణపతిరావు: నానా? ( విసురుగా లేస్తాడు. )

పాల్: ( వెటకారంగా ) అవును! మీరే. గణపతిరావుగారూ!

గణపతిరావు: ( కోపంగా ) వోరితో అంతనావో ఎరికేనా?

పాల్: ( నవ్వి) ఎవరితో అంటున్నాను? మున్సిపల్ చైర్మన్ తోనా?

గణపతిరావు: అవ్! సేరుమేనుతో! కాదేంటి మరి!

పాల్: కాదు! ఒక హంతకునితో!

—గణపతిరావు: ( దూరంగా వెళుతూ ) నే నోరినీ సంపనేదు.

పాల్: ( అతని దగ్గరకు వెళుతూ ) చంపలేదు. నిజమే! చంపించారు. మీరిచ్చిన డబ్బు కాశపడి వాళ్ళు చంపారు. చచ్చిన వాడికి, చంపిన వాడికి సంబంధం లేదు. వాళ్ళ మధ్య పగ లేదు. ద్వేషం లేదు. కేవలం మీ రిచ్చే కూలి కోసం చంపారు. వాళ్ళది కాదు నేరం. పగబట్టి చంపించిన మీదీ నేరం! మీ దా పాపం! అందుకు బాధ్యులు మీరు! ఆ శిక్ష ననుభవించ వలసింది మీరు!

గణపతిరావు: నగరానికి పెదమ సవురుస్ని! గవురవనీయున్ని! నన్నీయిదంగా అవ మానించటం అన్నేయం! ఆ!

పాల్: హత్యలు చేయించటం న్యాయమా గణపతిరావుగారూ!

గణపతిరావు: ఆయ్! ఆయ్! సెందరబం నేకుండ మాటాడుతున్నరు! ఆ!

పాల్: సందర్భం చెప్పమంటారా? అయిదు సంవత్సరాల క్రితం మీ రీ నగర మున్సిపల్ ఛైర్మన్ పదవికి పోటీ చేస్తూ మీకు పోటీగా నిలిచిన ప్రత్యర్థిని చంపించారు.


గణపతిరావు: ( కోపంగా ) ఆగెహె!

పాల్: షటప్! అరిస్తే మీకే ప్రమాదం! మీ పాత రంకులన్నీ బయటపడతాయి.

గణపతిరావు: అయ్! మిట్టర్!

పాల్: గణపతీ! మీ అమ్మాయి పేద గుమాస్తా రామాన్ని ప్రేమిస్తే మీ పరువు ప్రతిష్ఠల కోసం రామాన్ని చంపించారు. కాదని చెప్పగలరా? నిజమని నేను నిరూపిస్తాను. మీకు రాసిన ఉత్తరంలో మీరు చేయించిన హత్యల వివరాలు చెప్పానుగా! ఆ ఉత్తరం బయట పడితే మీకే ప్రమాదం. ఆ సంగతి తెలిసే మీ రిక్కడకు వచ్చారు. వచ్చారూ అంటే అన్నీ అంగీక రించినట్టే కదా! ఇక్కడ నన్నేమైనా చేయాలనుకుంటున్నారేమో! ( టేబిలు దగ్గరకు వెళుతూ ) నా కటువంటి భయాలు లేవు. ( సొరుగు లాగి పిస్టలు తీసి పట్టుకుని ) ముందు మీ సంగతి చూసు కోండి. మీ జీవిత చరిత్ర గ్రంథమంతా మా అసిస్టెంటు దగ్గర సిద్ధంగా ఉంది. మీ చుట్టూ ఇనప తీగల వల బలంగా ఉంది. సైగచేస్తే సంకెళ్ళు వేయటానికి పోలీసు బలగం ఎదురు చూస్తూంది. వూ! చెప్పండి! చెప్పినట్టు వింటారా? చేవ చూపమంటారా?

గణపతిరావు: ఆయ్ బాబో! ఈ మాత్తరం దానికే ఎందుకండీ పిత్తోలు? మీరు పెద్దోరు! మీరేటంటే మాత్తరం నా ప్రిట్టేటికేటవుద్ది? అనండి!




లచ్చనంకి! మీ సెప్పు తీసి కొట్టండి! ఆయ్! మరండీ! తవరు కొట్టినా పర్లేదు గానండీ పైవోల్లు సూత్తే ఇబ్బందిగదండీ! అందుకండీ! తలుపు లేసీసొత్తనండి! ( ఎల్. ఎఫ్. కేసి వెళ్ళబోతాడు )

పాల్: (పిస్టలు చూపి) ఆగు! నాటక మాడి తప్పించుకుందా మనుకుంటున్నావా?

గణపతిరావు : అమ్మతోడు! నా మాట నమ్మండి! తవరు మాకు సేయితులుగందా!

పాల్ : ( ఎల్. ఎఫ్. లో అడ్డుగా నిలుచుని) ఆల్ రైట్! ఎన్నికల్లో ప్రత్యర్థిని చంపించారే! ఇది ప్రజా ప్రభుత్వమా? పైశాచిక నియంతృత్వమా?

గణపతిరావు : నాకు తెలీకుండా మా గూపోల్లు తొందరపడిపోనారు.

పాల్ : ముఠా రాజకీయాలతో ఆటవిక జాతుల కన్న అధ్వాన్నంగా తయారవు తున్నాం. నాగరికత పరదాలో రాతి యుగం కన్న వెనక్కి పోతున్నాం. సమానత్వం సాధిస్తామని మానవత్వాన్నే మంట గలుపుతున్నాం.

గణపతిరావు : ఆయ్! సత్తెవేనండి! మావోల్లని కడిగేసినాను గదండీ!

పాల్ : మీరు చేసింది మాత్ర మేమిటి? రామం పేదవాడు కాబట్టి మీ అల్లుడు కావటానికి వీల్లేదనేగా చంపించారు. అంతకన్న దారుణం, అమానుషత్వం మరొకటి ఉంటుందా? పిల్ల నివ్వటం మానితే సరి పోయేదిగా! అతన్ని చంపించటం దేనికి?

గణపతిరావు : ఆయ్ బాబో! మానితే వూరుకుంట రేంటి? నేసి సక్కబోతరు!

పాల్ : అలాగని చంపించా రన్న మాట!

గణపతిరావు : నేదండి! రామంగోడిని సంపింది మావోల్లు గాదు! రిచ్చావోడు!

పాల్ : (కోపంగా) రిక్షావాడు చంపాడా? ( మీదకు వెళుతూ) రిక్షావాడా?

గణపతిరావు : ( బెదురుతూ ) కా...కా... కాదండి! మా యెదవలే!

పాల్ : వూ! అలా నిజాన్ని ఒప్పుకోండి! అదే చాలు నాకు!

గణపతిరావు : ఆయ్, బాబో! మద్దెన తవరి కెందుకండి?

పాల్ : నిజాన్ని వినగలిగినందుకు! రామం. మీ అమ్మాయి కలిసి ఆ రిక్షాలోనే షికార్లకు, సినిమాలకు వెళ్ళేవారు! ఆ రిక్షావాడంటే రామాని కెంతో ఇష్టం! ఎందుకో తెలుసా?

గణపతిరావు : మాంచి జోరుగా తొక్కేవోడు గావలు!

పాల్ : కాదు. రామం, ఆ రిక్షావాడు స్నేహితులు. దరిద్రం వల్ల రిక్షా తొక్కే నంత మాత్రాన హత్యలు చేసేటంత — అందులోను స్నేహితుడిని చంపేటంత నీచుడు కా దా రిక్షావాడు! రామం — రిక్షావాడు బి. ఎ., వరకు కలిసి చదువుకున్నారు.

గణపతిరావు : ఏటేటి? బియ్యే సదివి రిచ్చా తొక్కాడా?

పాల్ : అక్షరాలు రాని ప్రజా నాయకుల పరిపాలనలో చదువుకున్నవాళ్ళు, హృదయమున్న వాళ్ళు అంతకన్న మరేం చేయగలరు?

గణపతిరావు : ఆయ్! అది మా తప్పు కాదు కదండీ!

పాల్ : అవును. మీ తప్పుకాదు. మీ రేదో ఉద్ధరిస్తారని ఉబలాటపడి ఉరి పోసుకున్న పేదవాళ్ళ తప్పు. ఆదరించి అందల మెక్కిస్తా రనుకున్న అమాయకల ఆడపడుచుల తప్పు. బాధలు సహిస్తూ ప్రతి అయిదేళ్ళకు మోసపోతున్న ప్రజల తప్పు. తప్పని తెలిసికూడా ఎప్పటికప్పుడు తప్పటడుగులు వేస్తున్న ప్రజ్ఞావంతుల తప్పు. ఈ తప్పుల తమాషా ఇలా సాగిపోవలసిందే! తీరదీ దురవస్థ! మారదీ వ్యవస్థ!

గణపతిరావు : అయ్, బాబో! కెమంగా మారిసేత్తున్నాం గదండీ!

పాల్ : ఏమిటి మీర మార్చేది? పార్టీలు మార్చి, ప్రజలను ఏమార్చి అధికారాన్ని సంపదగా కూర్చుకుంటున్నారు.

గణపతిరావు : మేం తెచ్చిన పెగతి మాట ఏటంటరు?

పాల్ : హా! ప్రగతి! జాతి, మత, కుల ప్రమేయం లేని దేశమని చెప్పుకుంటూ కులాల వారీగా, మతాల వారీగా కాలేజీలు కట్టుకుంటున్నాం. హాస్టల్సు పెట్టుకుంటున్నాం. పదవులు పంచుకుంటున్నాం. సత్యం. అహింస, ఆదర్శాలని చెప్పుకుంటూ సత్యాన్ని హింసించి నాశనం చేస్తున్నాం. దేశం ప్రగతి పథంలో పయనిస్తోంది. ఈ నినాదాలే మనం సాధించిన ప్రగతి. అందుకే ప్రజల కీ దుర్గతి!

గణపతిరావు : అయ్! మా నాయకులతో పోలిత్తే నే నెంతండి? గుమ్మడి కాయ ముందు ఆవగింజ లాంటోడ్ని. పెద్దల అడుగుజాడల్లో నడుత్తా.

పాల్ : నిజమే, గణపతిరావుగారూ! కోట్లకొలది పెరిగిపోయిన గుమ్మడి కాయల మధ్య ఆవగింజను వెదక నక్కరలేదు.

గణపతిరావు : అయ్! అందుకేనండి! ఇది తీసేసుకుని నన్ను ఇడిసేయండి. తవరు రాసినట్టుగా పాతిక ఏలు తెచ్చినా! తవరు రాసిన ఉత్తరం మా ఆడది సదివి సెప్పింది. పాతికేనా తవరు రాసింది? ( బేగ్‌ను టేబిలు మీద పెట్టి ) అచ్చరాలా పాతిక ఏలు. రూపాయికూడా తక్కువ నేదు. నానే నెక్కెట్టినా!

పాల్ : ఈ పాతికవేలు రామానికే ఇచ్చి మీ అమ్మాయి నిచ్చి పెళ్ళిచేస్తే ప్రేమించుకున్న వాళ్ళు హాయిగా ఉండేవాళ్ళు! మీ మానవత్వం విలువ పెరిగేది! మీ మంచితనం కలకాలం నిలిచేది!

గణపతిరావు : మరండీ! వరకట్నం నిసేదం బిల్లు ఉందంట కదండీ!

పాల్ : అందుకని? వరుని చంపేయమన్నారా?

గణపతిరావు : అయ్! అ మాట ఇంక సెప్పకండి! సిగ్గేసిపోనాది!

పాల్ : సిగ్గుపడవలసింది మీరు కాదు. మీ వంటి నాయకులను తయారు చేసుకున్న ప్రజలు! మీ కడుపున పుట్టిన బిడ్డలు! మీ అమ్మాయికి మీ లక్షణాలు రాలేదు. ఆమెకు నా ఆశీస్సులు అందించండి!

గణపతిరావు : అయ్, బాబో! అదేం చేసినాదండీ?

పాల్ : రిక్షాలో ఉన్న రామాన్ని హత్య చేసినపుడు పక్కనే ఉన్న మీ అమ్మాయి హత్యా నేరాన్ని రిక్షావాడి మీదకు దొర్లిస్తారని గ్రహించి రిక్షావాడికి డబ్బిచ్చి పారిపొమ్మంది.

గణపతిరావు : అంత పని చేసేసినాదా?

పాల్ : ఏం? మీ కడుపున చెడబుట్టిందా?

గణపతిరావు : అయ్! మరండీ! ఇయ్యన్నీ తవరి కెలా తెలుసుపోనాయండి?

పాల్ : ఇంకా తెలుసు, గణపతిరావుగారూ! మునిసిపల్ ఆసుపత్రులకు మందులు కొనకుండానే బిల్లులు సృష్టించి మీరు స్వాహా చేస్తున్న డబ్బు వివరాలు, కంట్రాక్టర్లతో కుమ్మక్కయి పనులు చేయకుండానే గ్రాంటులు ఖర్చు పెడుతున్న గారడీలు, మీ కోరిక తీర్చలేక ఉద్యోగం పోగొట్టుకున్న పంతులమ్మల జాబితాలు చెప్పమంటారా?

గణపతిరావు : అయ్ బాబో! పెద్దోరు! తవరి కెందుకండీ అంత సెమ?


పాల్ : ఆ రిక్షావా డిప్పుడు మా డిపార్టుమెంటులోనే పని చేస్తున్నాడు. అత నెప్పుడూ నాతోనే ఉంటాడు! వాడి పెళ్ళికే డబ్బు లోటు వచ్చి మీకు రాశాను!

గణపతిరావు : అయ్! మంచిదే గదండీ! పెల్లి జరిపించండి!

పాల్ : బై ది బై, మీ అమ్మాయికి పెళ్ళయిందా?

గణపతిరావు : ఆ! ఆ! అయినాది! అల్లుడికి ఐదరాబాదులో ఉద్యోగం.

పాల్ : మీ అమ్మాయికి మొగుడొచ్చాడు! మీకు అల్లుడొచ్చాడు! కానీ




రామం తల్లిదండ్రులకు కొడుకెలా వస్తాడు? ఆ రిక్షావాడికి స్నేహితు డెలా వస్తాడు?

గణపతిరావు : నాకు సిగ్గేసి పోనాది! ఆ మాట సెప్పకండి!

పాల్ : చివరి మాట! వన్నేమైనా చేయాలనుకుంటే మీరే వలలో చిక్కుకుంటారు. జాగ్రత్త!

గణపతిరావు : రామ రామ! పెమాణంగా సెబుతున్న! తవరు మా సేయితులు!

పాల్ : మంచిది. వెళ్ళండి. ( పిస్టలు టేబిలు సొరుగులో పెడతాడు. )

గణపతిరావు : దండాలు! ( గబగబా ఎల్. ఎఫ్. లోకి వెళ్ళిపోతాడు )

పాల్ : ( బేగ్ తెరచి చూచి మళ్ళీ జిప్ మూసేస్తాడు. కారు శబ్దం దూర మవుతుంది. విస్కీ సిప్ చేస్తూ కళ్ళజోడు తీసేస్తాడు. )

రాజా : ( ఎల్. ఎఫ్. లోంచి వస్తాడు. )

పాల్ : ఇంతసేపు ఎక్కడున్నావురా?

రాజా : గార్డెన్‌లో చెట్టుకింద. బాలా! నీ దగ్గరకు పెద్ద పెద్ద వాళ్ళు వస్తున్నారు. ఏమిటి నీ ఉద్యోగం?

పాల్ : స్పెషలాఫీసర్!

రాజా : ఏ డిపార్టుమెంటు?

పాల్ : మాది ఆలిండియా స్పెషల్ సర్వీస్! ఎప్పు డెక్కడికి ఏ హోదాలో వెళ్ళమంటే వస్తే ఆ హోదాలో వెళుతుంటాను. అవతలివాళ్ళను బట్టి నా డిపార్టుమెంటు మారుతూ ఉంటుంది.

రాజా : రిక్షా తొక్కా వన్నావు! ఈ ఉద్యోగ మెలా వచ్చింది?

పాల్ : విధి చేసిన గారడీ! మా నాన్న లారీ కింద పడి తల పగిలి చావటానికి సిద్ధంగా ఉంటే ఆ నెత్తుటి ముద్దను రిక్షాలో వేసుకుని గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకు వెళితే చేర్చుకోవటానికి వంద రూపాయ లిమ్మన్నారు. కుందన్‌లాల్ సేఠ్‌ని నా డబ్బు నా కిమ్మంటే మంగళవారం ఇస్త నన్నాడు. నా రిక్షాలోనే చచ్చిపోయాడు మా నాన్న. అమ్మలేని నాకు నాన్నకూడా లేకుండా పోయాడు. ( ఏడుపు నాపలేక నోరు నొక్కుకుంటాడు. )

రాజా : బాధపడకు, బాలా.

పాల్ : కుందన్‌లాల్ నా డబ్బు నా కిచ్చి ఉంటే మా నాన్నను బ్రతికించుకునే వాడిని. బలవంతుడు తన్ని లాక్కున్నా దాసోహ మంటుం దీ సంఘం. పేదవాడు చేసిన పనికి కూలి ఇమ్మన్నా తరిమి కొడుతుం దీ సంఘం.

రాజా : నిజమే, బాలా!

పాల్ : ప్రమాదం జరిగిన స్థలం నుంచి మా నాన్నను కదపటం నేరమనీ అందువల్లనే చచ్చిపోయాడనీ పోలీసులు నన్ను అరెస్టుచేసి కేసు పెట్టారు. చంపిపోయిన లారీ పంక్తి వాళ్ళ కక్కర లేదు. తండ్రిని బ్రతికించు కోవాలని ప్రయత్నించిన కొడుకు ముద్దాయి. మా నాన్న చనిపోయి

నందుకే ఏడవనా, చేయని నేరానికి జైలుకు వెళ్ళినందుకే ఏడవనా?

రాజా : జైల్లో ఎన్నాళ్ళున్నావు?

పాల్ : ఆరు మాసాలు. ఇరవై వాయిదాలు వేసి కేసు కొట్టేశారు. ఆరు నెలలు పరిశీలిస్తేగాని అందులోని సత్యం గోచరించలేదు న్యాయస్థానానికి! నిరపరాధిని విడిచి పెట్టారు తప్ప ఆరు మాసాలపాటు నే ననుభవించిన జైలు శిక్షను ఎలా మార్చగలరు?

రాజా : జైలునుంచి విడుదల కాగానే స్పెషలాఫీసరు వయ్యావా?

పాల్ : లేదు, రాజా! జైలునుంచి బయటకు రాగానే గట్టిగా అడుగువాయని కుందన్‌లాల్ ఇంటికి వెళ్ళాను. అక్కడ మరో ప్రమాదం ఎదురయింది.

రాజా : ఏమిటది?

పాల్ : ఆ ఇంట్లో అంట్లుతోమే పేద పిల్ల శేట్ కొడుకు వల్లో పడి గర్భవతి అయితే, ఆ పాపాన్ని నా కంఠ కట్టాలని చూశాడు శేట్. ఆ పిల్ల నన్ను సొంత అన్నలా చూసేది. 'అన్నా అని పిలిచేది' వాళ్ళు చేస్తున్న ప్రయత్నం తెలిసి శేట్‌ని కలుసుకోకుండానే తిరిగి వెళ్ళిపోయాను. ఆ పిల్ల ఉరిపెట్టుకుని చనిపోయింది.

రాజా: దారుణం!

పాల్ అంతకన్న దారుణం మరొకటి జరిగింది.

రాజా: అదేమిటి?

పాల్: మన క్లాస్ మేట్ రామం గుర్తున్నాడా?

రాజా: ఆ! పాపం! చనిపోయాడు కదూ!

పాల్: లేదు. చంపేశారు.

రాజా: అవునాట్టు.విన్నాను ఇందాక వచ్చిన గణపతిరావ్ చంపించాడనిచెప్పుకుంటారు వాళ్ళమ్మాయి రామూ న్ని ప్రేమించిదట!

పాల్: నిజమే! వాళ్ళిద్దరు నా రిక్షాలో ఉండగానే రామాన్ని హత్య చేశారు. హత్యానేరాన్ని నా మీద పెడతారని గ్రహించిన ఆ అమ్మాయి నాకు డబ్బిచ్చి పారిపొమ్మంది. గమ్యం లేకుండా ప్రయాణం చేసి బంగ్లాదేశం చేరాను. భారత్—పాకిస్తాన్‌యుద్ధంలో పని చేశాను, నాధైర్య సాహసాలను మెచ్చి యుద్ధం ముగియగానే భారత ప్రభుత్వం నాకీ ఉద్యోగ మిచ్చింది. అందుకే ఈ పోస్టు స్పెషలాఫీసర్ అయింది.

రాజా: ( టేబిలు మీదున్న కవరులోని కాగితం తీసి ) కూపే నంబర్ వన్ ఈజ్ రిజర్వ్‌డ్ ఫర్ శ్రీ బి. జి. పాల్ ఎమ్. ఎల్. ఎల్. బి., స్పెషలాఫీసర్! న్యూఢిల్లీ! ( అని చదివి అతని వంక చూస్తూ ) ఈ రిజర్వేషను నీ దేనా?

పాల్: వాడే!

రాజా: మరి నీ పేరు బి. జి. పాల్ అని ఉందేమిటి?

పాల్: బి. జి. పాల్! అంటే బాలగోపాల్! నువ్వు బాలా అంటావు! రాధ గోపీ అంటుంది! అలాగే లోకం నన్ను బి. జి. పాల్ అంటుంది! సొంత ఇంట్లో వండిందైనా పక్కింటావిడ పంపిందంటే ఆపురాపురు మంటూ తింటాడు మగాడు. అలాంటిదే ఈ పేరు మార్పు.

రాజా: ఎమ్. ఎల్. ఎల్. బి. ఎప్పుడు చేశావు?

పాల్: డబ్బిస్తే పట్టా లిచ్చే యూనివర్సిటీ లుండగా డిగ్రీలకు లోటేమిటిరా? నన్ను రేపే పాటికి పి హెచ్. డి. చేయమంటావా?

తాత: ( కారియర్ పట్టుకుని ఎల్. ఎఫ్. లోనుంచి వచ్చి ) అన్నం వడ్డించ మంటారా?

పాల్: ఆ! వడ్డించు, తాతా! రాజా! నువ్వుకూడా నాతో కూర్చోవాలి. ఇద్దరం కలిసి తిని ఎన్నాళ్ళయిందో! నీ కిష్టమని ఉల్లిగారెలు పాయసం తెప్పించాను.

రాజా: నీకు నేను రుణపడి పోతున్నాను బాలా!

పాల్: తిన్న తరవాత తీర్చవచ్చులే! రా! కూర్చో!

రాజా: ఇప్పుడే వస్తాను. ( విసురుగా ఎల్. ఎఫ్. లోకి వెళతాడు )

తాత: టేబిలు మీద ఉన్న బాగ్ తీసి టీపాయి మీద పెట్టి టేబిలు



మొహమాటానికి సిగ్గుపడితే నివారణ ఆలస్యం అవుతుంది



వైవాహిక జీవితంలో నిజమైన ఆనందాన్ని అనుభవించండి.

సిగ్గు సందేహాలతో మీ దాంపత్య జీవితాన్ని వృధా చేసుకోకండి. మీ రోగము మరియు సమస్యల పూర్తి వివరాలను వ్రాసి ఉచిత సలహాను అడగండి. ఆయుర్వేద మాత్రాల పూర్తి సహకారాన్ని అందుకొని మీ దాంపత్య జీవితాన్ని ఆనందమయం చేసుకోండి. మీ ఉత్తర ప్రత్యుత్తరాలు అత్యంత రహస్యంగా ఉంచబడతాయి. యువతకు ఉచితంగా లభించే "స్త్రీ-పురుష్" గైడ్ కొరకు మాకు వ్రాయండి.

NATH AYURVEDASHRAM (RW-10)
P.O. KATRI SARAI (GAYA) INDIA



తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి

తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు నుండి ప్రశంసలు అందినవి. అది అంత ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారి పోవడం మొదలవుతుంది. మరియు శీఘ్రంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అది ఎంత బాగా పనిచేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెడు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారమునకై ఉచితంగా సలహాలు ఇయ్యబడుతున్నాయి. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒకసారి వాటి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి. మీ అనలురూపం మీకు వస్తుంది. NATH AYURVEDASHRAM (RW-25)
P.O. KATRI SARAI (GAYA)



ముస్తాబులో మార్పు!




సరిక్రొత్త
ఆకర్షణీయమైన సీసాలలో

లోధ్ర

బాధారహిత
ఆరోగ్యమును స్త్రీలకు
80 సంవత్సరములుగా
ఇచ్చుచున్నది.

ఉచిత వైద్య సలహాకు ఈ
కూపనును పూర్తిచేసి
పంపండి.

పేరు: ....................
విలాసము: ....................
....................PIN..........

ఏజంట్లు:
శీతారామ జనరల్
స్టోర్స్ ఏజన్సీస
విజయవాడ —సికింద్రాబాద్

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14

ఏడుస్తూ) బాబూ! మీ మాట అచ్చంగా ఈ ప్రాంతం మాటలాగే ఉంది! ఇది ఏ దేశం, బాబూ?

పాల్: మా స్వగ్రామం ఈ పక్కనే, తాతా!

తాత: అలాగా! ఏ వూరు బాబూ!?

పాల్: రామాయపాలెం.

తాత: (వింతగా) ఆ! ఎవరి తాలూకు బాబూ?

పాల్: ఇప్పుడు నా వాళ్ళు ఎవరూ లేరు రాధ తప్ప!

తాత: (ఉలిక్కిపడి ఆత్రంగా) రాధా? ఎవరు బాబూ, ఆ రాధ?

పాల్: (గ్లాసులో విస్కీ పోస్తూ) నాకు కాబోయే భార్య!

తాత: (కంగారుగా) ఎవరమ్మాయి, బాబూ?

పాల్: నీకు తెలియదులే, తాతా! అతనొక ధనమదాంధుడు. (తాగుతుంటాడు)

తాత: వాడి పేరేమిటి? చెప్పు, బాబూ! ఎవరతను?

పాల్: ఎందుకు, తాతా? ఎందుకలా కంగారు పడుతున్నావు?

తాత: కావాలి! చెప్పు బాబూ! రాధమ్మ తండ్రి పేరేమిటి?

పాల్: ధనరాజు!

తాత: (కెవ్వున అరిచినట్టుగా) బాబూ! బాబూ! (గొల్లుమంటాడు)

పాల్: ఏమిటి తాతా? ఏమయింది?

తాత: (ఏడుస్తూ) రాధ ప్రేమించిన గోపీవి నువ్వేనా?

పాల్: అవును, తాతా! రాధ నన్ను గోపీ అనే పిలిచేది.

తాత: మొలలోనుంచి కాగితం తీస్తూ) బాబూ! ఇంతకాలం నీ కోసమే ఎదురు చూస్తున్నాను బాబూ! ఈ ఉత్తరం నీ కివ్వటానికే బతికున్నాను బాబూ ఇది రాధమ్మ నీకు రాసిన ఉత్తరం బాబూ! (కాగితం ఇస్తాడు)

పాల్: (మడతలు విప్పి చూసి) ఇంత పాతబడి చివికి పోయిందేమిటి? ఒక్క అక్షరంకూడా కనిపించడం లేదు. రాధ నీ కెలా తెలుసు?

తాత: ఆ తాగుబోతు ధనరాజును నేనే, బాబూ!

పాల్: నువ్వు! నువ్వు ధనరాజువా? ఇలా ఎందుకయ్యావు?

తాత: స్నేహితుడ్ని నమ్మి తాగుడు మైకంలో అంతా పోగొట్టుకున్నాను. అయినా ఈ ఉత్తరం నీ కివ్వాలనే బతుకుతున్నాను. ఇది నా రాధమ్మ చివరి కోరిక బాబూ!

పాల్ : (భయంగా) చివరి కోరికా? అంటే — రాధ —

తాత : (ఏడుస్తూ) రాధ! ఇంక లేదు, బాబూ! చచ్చిపోయింది.

పాల్ : రాధా! (కెవ్వున అరచి తల పట్టుకుని) లేదు. నా రాధ చచ్చిపోలేదు. చెప్పు! నా రాధ చచ్చిపోలేదని చెప్పు.

తాత : ఇష్టంలేని పెళ్ళి చేయబోతే విషం తాగి చచ్చిపోయింది, బాబూ!

పాల్ : (దుఃఖంతో) ఎంత పని చేశావు. రాధా! ఎప్పటికైనా నీకోసం, నేను వస్తానని నీకు తెలియదా? నాతోనే బతుకు, నాతోనే చావని మాటిచ్చావే! నన్ను విడిచి ఎలా వెళ్ళిపోయావు, రాధా? మీ నాన్న కోరినట్టుగా పది లక్షలు సంపాదించి తెచ్చాను! ఎందుకు తొందరపడ్డావు, రాధా?

తాత : ఆ పాపం నాది. నా మూలంగానే రాధ చచ్చిపోయింది.

పాల్ : నా రాధ లేనప్పుడు నా కెందుకీ డబ్బు! పట్టుకుపో! అంతా పట్టుకుపో! (కన్నీళ్ళతో నవ్వుతూ) రాజా! ఒరే, రాజా! నా పెళ్ళి నీ చేతుల మీదుగా చేయిస్తానన్నావు గదరా! చేయించరా! ఇదిగోరా పెళ్ళి ఖర్చులకు డబ్బు! రారా! తీసుకోరా! (టేబిలు సొరుగు లాగి నోట్ల కట్టలు తీయబోతాడు.)

రాజా : (ఎల్. ఎఫ్. లోనుంచి చటుక్కున వచ్చి పిస్టలు గురిపెట్టి) హేండ్సప్.


పాల్ : అటు చూసి బిత్తరపోయి (రాజా!) బయట విజిల్స్ బూట్లశబ్దాలు)

రాజా : (పిస్టలు ముందుకు చాపి) వూ! హేండ్సప్!

పాల్ : (చేతులు పైకెత్తి) రాజా!

రాజా : అవును, రాజానే! నీ స్నేహితుడినే! కాని నువ్వనుకున్నట్టుగా నిరుద్యోగిని కాను. క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌ని! నీ కోసం దేశమంతా గాలిస్తున్నాం. వేరు వేరు ఉద్యోగాల పేర్లు చెప్పి ధనవంతుల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నావు. చివరకు నీ జన్మస్థలంలో చిక్కావు. నేటితో నీ ఆటకట్టు.

పాల్ : రాజా! ఈ సంఘంలోని మనిషికి కృతజ్ఞత కూడా ఉండకూడదని చివరి పాఠం చెప్పావురా! ఆల్‌రైట్! కాల్చు! కాల్చరా! నా ఆశలన్నీ తీరిపోయాయి. ఇంక బతక నవసరం లేదు. కాల్చరా!




రాజా : నిన్ను చంపను. ప్రభుత్వానికి అప్పగిస్తాను. అది నా విధి! నా డ్యూటీ!

పాల్ : నా చివరి మాట ఒక్కటి వింటావా?

రాజా : స్నేహితునిగా నేను చేయగలిగిం దేమైనా ఉంటే చెప్పు. తప్పక చేస్తాను. నా ఉద్యోగ ధర్మాన్ని మాత్రం విస్మరించలేను.

పాల్ : స్నేహితునిగా కాదు, ప్రభుత్వ మనిషిగానే విను.

రాజా : సరే, చెప్పు. కాలు కదపకు!

పాల్ : ఆల్‌రైట్! ఏ ఆఫీసర్ని కాను నేను. బ్లాక్ మెయిల్ చేసి లక్షలు సంపాదించాను. కానీ ఏ నాడూ మంచివాళ్ళ జోలికి పోలేదు. నేను చూసిన వాళ్ళంతా కుందన్‌లాల్ శేట్ వంటి వాళ్ళే! ఛైర్మన్ గణపతిరావు వంటి వాళ్ళే. సంఘం నిండా దేశం నిండా వీళ్ళే! వాళ్ళు ప్రజలను, ప్రభుత్వాన్ని దోచుకుంటుంటే వాళ్ళ దగ్గర నేను లాక్కున్నాను. నా నేరానికి శిక్ష ఉంటే అంతకు వేయిరెట్లు, లక్ష రెట్లు నేరాలు, ఘోరాలు చేసిన వీళ్ళందరికీ ఏమిటి శిక్ష?

రాజా : ఆ పని చట్టాలది! శాసనాలది!

పాల్ : హు! చట్టాలు! శాసనాలు! ఎక్కడున్నాయి? ఏం చేస్తున్నాయి? ధనవంతుల జేబుల్లో దాగిపోయాయా? బలవంతుల గుప్పెట్లో చిక్కుకుపోయాయా? (చటుక్కున పిస్టల్ అందుకుని గురిపెట్టి) రాజా! కాల్చరా! ఇప్పుడు కాల్చు!

రాజా : బాలా! లొంగిపో! లొంగిపో! సరండర్ యువర్‌సెల్ఫ్!

పాల్ : నువ్వు కాల్చుతావా, నన్ను కాల్చమన్నావా?

రాజా : నన్ను కాల్చినా నువ్వు తప్పించుకోలేవు. బంగళా చుట్టూ పోలీసు బలగం బలంగా కాపలా ఉంది. సవ్యంగా లొంగిపోతే శిక్ష తగ్గుతుంది.

పాల్ : రాజా! నాలో చావకుండా మిగిలింది కృతజ్ఞత ఒక్కటేరా! దాన్ని బంధించాలని చూస్తున్నావు! కానీ నీ కా అవకాశ మివ్వను, రాజా! (చటుక్కున తన కణత మీద కాల్చుకుంటాడు.)

(రాజా, తాత పెద్దగా అరచి రెండు వైపుల నుంచీ వచ్చి పాల్‌ని పడిపోకుండా పట్టుకుంటారు.)

రాజా : (దుఃఖంతో) బాలా! నీలో కృతజ్ఞత చావలేదురా! అదే లేకపోతే నన్నే కాల్చేవాడివిగా! నువ్వేరా నాకు నిజమైన స్నేహితుడు.

(పాల్ కణతల నుండి రక్తం కారుతుంటుంది. రాజా చేతిలో చేయి వేసి తల వాల్చేస్తాడు పాల్. రాజా పాల్‌ని కౌగిలించుకుంటాడు. తొందరగా పడుతుంది తెర.)

★